ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

ఆదివారం 16 మార్చి 2025



● వెంకటపాలెంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం

మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేద పండితులు

అమరావతి ఆధ్యాత్మిక నగరి

- అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం
- గోవిందనామస్మరణతో మార్మోగిన వెంకటపాలెం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు
- కల్యాణోత్సవానికి గవర్నర్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాజధాని వాసులు హాజరు

గోవింద నామస్మరణలు.. అన్నమయ్య సంకీర్తనలతో భక్తుల తన్మయత్వం.. భక్తుల కోలాటాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రాజధాని అమరావతి ఆధ్యాత్మికనగరంగా మారిపోయింది. విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా వెలుగులీనుతుండగా రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి సప్త ద్వారాలు, ఆనంద నిలయంతో వైకుంఠాన్ని తలపించేలా టీటీడీ కల్యాణ వేదిక ఏర్పాటు చేయగా రంగు రంగుల పుష్పాలు, ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరగ్గా ఆహుతులు తిలకించి పరమానందభరితులయ్యారు.

తుళ్లూరు, గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవింద.. ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా.. అంటూ భక్తులు వెంకన్న నామాలను స్మరిస్తుండగా.. అత్యత్భుత అలంకరణలతో ఇల వైకుంఠం తిరుమలను రాజధాని అమరావతిలో ప్రతిష్ఠించారా అన్నట్లు జరిగిన ఏర్పాట్లు, అలంకరణల మధ్య వెంక టపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి కల్యాణం కన్నుల పండు వగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో ఆ దేవ దేవుడి కల్యాణ మహోత్సవం అమరావతి రాజ ధానిలో తొలిసారి అంగరంగ వైభవంగా జరిగిం ది. అన్నమాచార్య సంకీర్తనలు, వేద మంత్రో చ్చరణల మధ్య శ్రీనివాసుడి కల్యాణం రాజధాని ప్రజలకు కొత్త అనుభూతిని పంచిపెట్టింది. శ్రీవారి కల్యాణ వేదిక విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా విరాజిల్లింది. కల్యాణో త్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆద్యంతం భక్తి భావంతో తన్మయత్వం పొందారు. తొలుత ఆల యంలో స్వామివారిని దర్శించుకున్న అనంత రం మంగళవాయిద్యాల నడుమ సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు, గవర్నర్ నజీర్‌తో కలసి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు పట్టు వస్త్రాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ వేదపండితులు కల్యాణ వేడుక కైంకర్యాలను నిర్వహించారు. చివరగా కర్పూర హారతి, నక్షత్ర హారతి, మహా హారతితో కల్యాణోత్సవం అత్యంత ఘనంగా ముగిసింది. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, కొల్లు రవీంద్ర, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ ఈవో శ్యామల రావు, ఏఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, తమ్మిశెట్టి జానకీదేవి, ఎంఎస్ రాజు, భానుప్రకాశ్, కలెక్టర్ నాగలక్ష్మి అమ రావతిలోని వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు



స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రజలు





సమావేశం నుంచి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

- 82 మందికి 13 మంది జడ్పీటీసీలే హాజరు
- కోరం లేకపోవడంతో వాయిదా వేసిన చైర్‌పర్సన్
- ఆమోదానికి నోచుకోని బడ్జెట్.. ఏప్రిల్ నుంచి తిప్పలే
- వైసీపీ జడ్పీటీసీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- క్రిస్టీనా టీడీపీలో చేరినప్పటి నుంచి సహాయ నిరాకరణ

గుంటూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగన్ అసెంబ్లీకి పోవడంలేదు.. తాము మాత్రం జడ్పీ సమావేశానికి ఎందుకు వెళ్లాలి.. అనుకున్నారో ఏమో జడ్పీటీసీలు శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో కీలకమైన సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీలు బహిష్కరిం చా రు. జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షతన ఉద యం 10.30 గం టలకు ఒకటో స్థాయి సంఘ సమావేశం ప్రారంభం కాగా జడ్పీ టీసీలు ఆలస్యంగా వచ్చారు. అయితే కోరం సరిపోవడంతో సమావేశాన్ని నిర్వహించారు. మిగిలిన స్థాయి (మిగతా 8వ పేజీలో)

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.23 (ఆదివారం సాయంత్రం)
సహరి : 4.58 సోమవారం ఉదయం



సమావేశం వాయిదాతో హాల్ నుంచి వెళ్లిపోతున్న అధికారులు

తీరంలో స్వచ్ఛత వెల్లివిరియాలి

- ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలి
- ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కృతికాశుక్లా
- సూర్యలంక సముద్రతీరంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుందరమైన సూర్యలంక సముద్ర తీరంలో స్వచ్ఛత వెల్లివిరియాలని ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కృతికాశుక్లా తెలిపారు. బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, అధికారులు తొలుత చీపుర్లు పట్టి బీచ్‌క్లీనింగ్ చేశారు. అనంతరం తీరంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కృతికాశుక్లా మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాల అములులో ఇప్పటికీ కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో సింగపూర్, లండన్‌లాంటి దేశాలకు ధీటుగా రాష్ట్రంలో పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, ఎస్పీ తుషార్‌డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీపీవో ప్రభాకర్, జిల్లా అటవీ, ఉద్యాన, విద్య, ప్రణాళికశాఖాధికారులు భీమయ్య, జెన్నెమ్మ, ఎస్.పురుషోత్తం, శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మ తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంక తీరంలో ఊడ్చి శుభ్రం చేస్తున్న రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లా స్పెషలాఫీసర్ కృతికా శుక్లా, కలెక్టర్ వెంకటమురళి



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తదితరులు

ఒకే గది.. ఐదు తరగతులు

దశాబ్దకాలంగా వేమూరులో విద్యార్థుల ఇక్కట్లు

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేమూరులో మండల పరిషత్ ప్రాథమిక జేబీ పాఠశాల భవన నిర్మాణ పనులు దశాబ్దకాలంగా పూర్తి కాలేదు. ఒక గదిలోనే ఐదు తరగతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతినడంతో 2015లో సమీపంలోని ఉర్దూ నార్త్ పాఠశాల భవనంలోకి జేబీ పాఠశాలను మార్చారు. ఉర్దూ పాఠశాలకు కింద ఒక గది ఆపైన ఒక గది మాత్రమే ఉన్నాయి. ఉర్దూ విద్యార్థులు కేవలం 10 మంది లోపే ఉండటంతో పై అంతస్తులో తరగతులను నిర్వహిస్తున్నారు. కింద ఉన్న గదిలో జేబీ పాఠశాల ఐదు తరగతుల ను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకే గదిలో 37 మంది విద్యార్థులు కూర్చోవాల్సి ఉంది. ఏ తరగతికి ఆ తరగతి ఉపాధ్యాయులు ఒక్కొక్కరుగా వెళ్లి పాఠం చెప్పి తిరిగి బయట కూర్చొంటున్నారు. ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశలో జేబీ పాఠశాల భవన నిర్మాణానికి రూ.13 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.7 లక్షలు విడుదల చేసింది. 2024 జూన్‌కి భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే కిటికీలు, రంగుల పనులతో పాటు ఆర్వో ప్లాంటు నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో కొత్త భవనంలోకి పాఠశాల మార్పు జరగలేదు. ఒకే గదిలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని కొందరు తల్లిదండ్రులు వేరే పాఠశాలలో చేర్పించారు. ఇంకా అధికారులు అలసత్వం చూపితే జేబీ పాఠశాల పరిధిలో మరింతగా పిల్లలు తగ్గే అవకాశం ఉంది.



ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థుల కూర్చున్న దృశ్యం

ప్రభుత్వాస్పత్రిలో ప్యాప్-డీ సెంటర్ ఏర్పాటు

● రాష్ట్రంలో ఈ తరహా కేంద్రం ఇదే మొదటిసారి

గుంటూరు మెడికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఓపీ విభాగంలో.. ఔషధాలు వాడే విధానంపై రోగులకు అవగాహన కల్పించేందుకు శనివారం కొత్తగా ప్యాప్-డీ సెంటర్‌ను (పేషెంట్ ఏవేర్‌నెస్ ఆన్ ప్రిస్క్రైబ్డ్ డ్రగ్స్) ప్రారంభించారు. ఆసుపత్రి ఓపీ విభాగంలో ఆరవ నెంబర్ వార్డులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక కార్పోరేటర్ పోతురాజు సమతతో కలసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.



ప్యాప్‌డీ సెంటర్ ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగానికి అనుబంధంగా పని చేసే ఈ కేంద్రంలో ఫార్మసిస్టులు, మందులు వాడే విధానం రోగులకు వివరిస్తారు. ఈ సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యబోధన ఆసుపత్రుల్లో తొలిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో ప్యాప్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోగులు ఒకే మందును పలుసార్లు తీసుకోకుండా నివారిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందచారాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సాల్మన్‌రాజు, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

◆ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రక్ ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

◆ అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి ◆ మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై అతి వేగంతో వెళుతూ.. ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన వేమూరు-తెనాలి ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. తెనాలి మండలం కొలివరం గ్రామానికి చెందిన బత్తిభట్ల శ్రీధర్ (28) గుంటూరు మంగళదాస్ నగర్‌కు చెందిన తోట సోముకుమార్‌లు ద్విచక్ర వాహనంపై కొల్లూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. వాహనాన్ని నడుపుతున్న శ్రీధర్ అతి వేగంతో నడపడంతో పాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న టాటా ఏసీని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో శ్రీధర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోముకుమార్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన చోటు చేసుకోగానే సమీపంలోని వ్యక్తులు 108 వాహనానికి ఫోన్ చేయగా రెండు గంటల వరకు అందుబాటులోకి రాకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన శ్రీధర్‌ను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయాలపాలైన సోముకుమార్‌ను చికిత్స నిమిత్తంగా ఆటోలో తెనాలి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

మధ్యవర్తిత్వంతోనే వివాదాల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

పెదకాకాని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోర్టు గుమ్మం తొక్కకుండానే ప్రత్యామ్నాయ విధానాల ద్వారా వివాదాల పరిష్కారం చౌకగా, సత్వర న్యాయం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 'ఏషియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్' సంస్థతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ చీమలపాటి రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులందరూ వీలైనంతవరకు స్నేహపూర్వకమైన విధానాల ద్వారా ముఖ్యంగా చట్టప్రకారమైన ఆర్బిట్రేషన్ అనగా మధ్యవర్తిత్వపు పద్ధతిలో కోర్టు వెలుపల వివాదాలను పరిష్కరించుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించారు. న్యాయ విద్యార్థులు అన్ని రంగాల వలే వారి రంగంలో కూడా నూరు శాతం విజయం సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే క్రమశిక్షణ, సహనం వంటి లక్షణాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజల్లో నిజాయితీ, సోదర భావాలు ఉండటం కారణంగా గ్రామ పెద్దల తీర్పులతో వివాదాలు సత్వరమే పరిష్కారం అయ్యేవన్న సంగతిని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు మారిన కాలమానం ప్రకారం మనలో కోరికలు అధికమై అహంతో ప్రతిదీ లిటిగేషన్‌కే ప్రాధాన్యమిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పరిష్కారం కానీ కేసుల సంఖ్య ఐదు కోట్లను దాటిపోవడం మనందరినీ భయభ్రాంతులకు గురిచేసే విషయంగా చెప్పుకొచ్చారు. గౌరవ అతిథి సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ఆర్.శాంతన కృష్ణన్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవిద్యలో ఆర్బిట్రేషన్‌ను ఒక సబ్జెక్టుగా తీసుకువచ్చి ఈ సమాజానికి ఎంతో మేలు చేస్తుందని కొనియాడారు. అయితే కేంద్రం మీడియేషన్ చట్టాన్ని 2023లో తీసుకువచ్చినప్పటికీ అమలుకు శ్రీకారం చుట్టుకపోవడం ఎంతో విచారకరమని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

మాట్లాడుతూ తమ తాతల కాలంలో రచ్చబండ విధానంలో ముత్తాత మరియు తాత ఆ గ్రామస్తుల వివాదాలని పరిష్కరిస్తుంటే తద్వారా తన కుటుంబానికి దక్కిన కీర్తిని అనుభవిస్తూ తాము చాలా గర్వించేవారమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీఐఏఎం కో ఫౌండర్ డాక్టర్ సూర్యరాజు, వర్సిటీ రిజిస్ట్రార్‌లు న్యాయ విద్యార్థుల ఇంటర్న్ షిప్‌కు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, కార్య శిబిరం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్.ఎల్ జయశ్రీ, హైకోర్టు న్యాయవాది, వర్సిటీ లీగల్ అడ్వైజర్ నర్రా శ్రీనివాసు, డాక్టర్ పీ వెంకటరమణ, డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఘంటా సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, బి.వి.చెన్నారావు, పరుచూరు కుమారి, ఆంగ్ల అధ్యాపకులు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ అభిలాష్ గోపీనాథన్, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజ్ ప్రిన్సిపాల్ నటరాజ్, వర్సిటీ, అనుబంధ కళాశాలల న్యాయ విద్యార్థులు, వివిధ జిల్లాల బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పిన్నెల్లి అనుచరులే భూకబ్జాదారులు : ఎమ్మెల్యే జూలకంటి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో పిన్నెల్లి కుటుంబం, ఆయన అనుచరులు వేల ఎకరాలను కబ్జా చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారులో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచక పాలనలో ఎందరో తమ విలువైన భూములను కోల్పోయారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి కబ్జాకోరులను జైలుకు పంపి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కులాలను రెచ్చగొట్టేలా రాజకీయాలు చేస్తే తాట తీస్తామని ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి హెచ్చరించారు. తాజాగా మాచర్ల పట్టణంలో రెండు కులాల మధ్య జరిగిన గొడవను రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూడడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు కబ్జాకోరులు రావద్దని, బాధితుల కోసమే ఈ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాదర్బార్‌కు 50కుపైగా వినతులు వచ్చాయి. రెవెన్యూ, భూకబ్జాలు, పింఛన్లు, సీఎం రిలీఫండ్ వంటి అనేక సమస్యలపై ప్రజలు తమ అర్జీలు ద్వారా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి విన్నవించారు. తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోస్తా ఆంధ్రాలోని ముస్లిం మైనార్టీ విద్యార్థులకు గుంటూరులో ఏర్పాటు చేసిన గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీ సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్‌జేసీసెట్ ద్వారా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఇందులో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40, సీఈసీలో 35 సీట్లు ఉంటాయని తెలిపారు. మైనార్టీ ముస్లిం విద్యార్థులతోపాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఒక్కో గ్రూపులో రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఉంటాయని తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న వారు https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8712625073, 9652569140లో సంప్రదించాలని సూచించారు.

నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ మౌలాలి బైపాసు నుంచే రూటుమార్పు

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజులు గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ని మౌలాలి బైపాసు నుంచే రూటుమార్పి నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17231 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28వ తేదీ నుంచి చర్లపల్లికి రాత్రి 8.30కి చేరుకొని 8.40కి బయలుదేరుతుంది. ఈ రైలు సికింద్రాబాద్‌కు వెళ్లకుండా మౌలాలి బైపాసు రూట్ నుంచి కామారెడ్డి మీదగా మరునటి రోజు ఉదయం 9.45కి నాగర్‌సోల్ చేరుకొంటుంది. నంబరు. 17232 నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి సికింద్రాబాద్‌కు కాకుండా చర్లపల్లికి రాత్రి 11.45కి చేరుకొని 11.55కు బయలుదేరుతుందన్నారు.

సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లాలి

● ఐకార్, ఐఏఆర్ఐ డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు

గుంటూరు(విద్య),మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో అభివృద్ధి అయిన సాంకేతికతను వ్యవహారికంగా రైతుల వద్దకు తీసుకెళ్లాలని న్యూఢిల్లీలోని ఐకార్, ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్‌ల ఆధ్వర్యంలో "అకడమియా ఇండస్ట్రీ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్, చెరుకుమల్లి శ్రీనివాసరావు

ఫార్మర్ పార్టనర్‌షిప్స్ కాన్‌క్లేవ్"ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్)ల మధ్య అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ పెదవేగిలోని ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కే సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి అనేక విద్యాసంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు కూడా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ, హైదరా బాద్‌లోని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీ తారా సత్యవతి, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ.. 13 మంది అరెస్టు.. 14 రోజుల రిమాండ్

మాచర్లటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నమోదైన కేసుల్లో పట్టణ పోలీసులు ఇరువర్గాలకు చెందిన 13 మందిని శుక్రవారం అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు మైనర్లు ఉండడంతో వారిని విజయవాడలోని జువైనల్ కోర్టుకు పంపారు. మిగిలిన పది మందిని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో స్థానిక తహసీల్దార్ కిరణ్‌కుమార్ వద్ద శనివారం హాజరుపరిచారు. కిరణ్‌కుమార్ వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిలో ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం, మరికొన్ని కేసులు కూడా నమోదు చేశారు. మిగిలిన వారిపై హత్యాయత్నం కేసు, మరికొన్ని కొట్లాట కేసులు నమోదు చేశారు. వీరందరిని పోలీసు బందోబస్తు మధ్య గురజాల సబ్‌జైల్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఎన్ఎస్పీ ఏఈ మృతి

బొల్లాపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం రమణయ్య(52) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. రమణయ్య గుంట్లపల్లి ఎన్ఎస్పీ కాలువ ఏఈగా పని చేస్తున్నారు. విధులు నిర్వహించుకుని తిరిగి వస్తుండగా శుక్రవారం రాత్రి ట్రాక్టర్‌ను ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం వినుకొండ తరలించగా మృతిచెందాడు. మృతునికి భార్య హనుమాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 519.50 అడుగులు ఉంది. ఇది 148.36 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎ ల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,277 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	91, 99, 110
చికెన్ విత్ స్కిన్(కిలో)	176.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	186.00

సీఎం చంద్రబాబు రాజకీయ జీవితం ఆదర్శనీయం

● ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య



మంగళగిరి సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాలను ప్రజలందరికీ సమానంగా అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. ఎమ్మెల్యేగా సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి శనివారంతో 47 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేగా 41 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్నారని చెప్పారు. ఈ రికార్డు ఏపీ చరిత్రలోనే ప్రథమ స్థానమన్నారు. విజన్-2020 నిజమై లక్షలాది ఉద్యోగాలు కల్పించిందని, సంపద సృష్టించిందని తెలిపారు. నేడు స్వర్ణాంధ్ర విజన్-2047తో పౌరుల తలసరి ఆదాయం రూ.35 లక్షలకు పెంచేందుకు అహర్నిశం కృషి జరుగుతుందని చెప్పారు. సామాజిక న్యాయానికి మారుపేరు చంద్రబాబు అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల కల్పన, డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. నాడు దీపం-1 పథకం ద్వారా 65 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు దీపం-2 ద్వారా 93 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని చెప్పారు. పాడి పరిశ్రమలో, ఐటీలో అధిక శాతం మంది మహిళలు ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారంటే అది చంద్రబాబు కృషేనన్నారు. ఏజెన్సీల్లో జగన్ గంజాయి మొక్కలు పెంచితే... చంద్రబాబు కాఫీ తోటలు పెంచారని, అరకు కాఫీని ప్రపంచ వ్యాపితం చేశారని అబద్దయ్య తెలిపారు.

ఏడాది ముందుగానే కావటి రాజీనామా

రేపటికి మేయర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు

కమిషనర్, కూటమి నేతలపై ఆరోపణలు, విమర్శలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మికి అందజేస్తున్నట్లు ఆయన శనివారం తెలిపారు. గుంటూరు సంపత్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందంటూ కూటమి నాయకులపై ధ్వజమెత్తారు. కమిషనర్ పులి శ్రీనివాస్‌పై ఆరోపణలు చేశారు. నాలుగేళ్లు నగర మేయర్‌గా పనిచేసిన కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా చేస్తున్న క్రమంలో కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ వెంట ఉంటానని తెలిపారు.

ఓటమి భయంతోనే..

మనోహర్‌నాయుడు మేయర్‌గా బాధ్యతలు చేపట్టి ఈ నెల 17వ తేదీకి నాలుగేళ్లు పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో 18న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ముందే తెలుసుకున్న మనోహర్‌నాయుడు ఓటమి భయంతో పదవికి రాజీనామా చేశారని తెలుస్తోంది. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ఎన్నికల నియమావళి ప్రకారం అవకాశం ఉన్నది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరు స్థానాలను కూటమి తరఫున కార్పొరేటర్లు కైవసం చేసుకున్నారు. అప్పటి నుంచి మేయర్ పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే కావటి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా ఆయన పని చేశారు. 2021లో జరిగిన ఎన్నికలలో కార్పొరేటర్‌గా గెలుపొందిన ఆయన మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి నాలుగేళ్ల గుంటూరు మేయర్‌గా వ్యవహరించారు.



ఇఫ్తార్ వడ్డిస్తున్న ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ (బాపట్ల), నసీర్ (గుంటూరు తూర్పు)

అల్లా ఆశీస్సులు అందరికీ ఉండాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అల్లా ఆశీస్సులు ముస్లింలతో పాటు అందరిపై మెండుగా ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని చందోలుగ్రామంలో ఉపవాస దీక్షాపరులైన ముస్లింలకు శనివారం వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నరేంద్రవర్మతోపాటు గుంటూరు తూర్పు నసీర్ కలిసి ఇఫ్తారు విందు వడ్డించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవ ప్రపంచంలో కుల,మతాలు వేరైన మనందరం ఒకటేననే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. తొలుత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సంతబజారులోని అమాను మసీదులో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు ఎండీ అఫ్జల్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షులు మహ్మద్ రజాక్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, ఎస్ఎస్ నియాజి, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం, సయ్యద్ నిజాం, మీరా, చందోలు ముస్లింలు, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పార్కును ప్రజలకు అందుబాటులోకి తెస్తాం : కమిషనర్



రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : చంద్రకళాపార్కును త్వరితగతిన సుందరీకరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఆయన బాపట్ల రైల్వేస్టేషన్ కూడలిలో పార్క్ పరిసరాలను శనివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణ పారిశుధ్యం విషయమై శానిటరి సిబ్బందికి సూచనలు చేశారు. దోమల బెడద ఎక్కువగా ఉన్నందున ప్రతి రోజు పట్టణంలో ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. వ్యాపారస్తులు ఇంకా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వ్యాపార దుకాణ సముదాయాలపై దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యలంకను షూటింగ్ స్పాట్‌గా చేయండి

● కలెక్టర్ జె.వెంకటమురళిని కోరిన సినీ దర్శకుడు దిలీప్‌రాజా



కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న సినీదర్శకులు దిలీప్‌రాజా

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంకను షూటింగ్ స్పాట్‌గా చేయాలని కోరుతూ మాఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా శనివారం కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు పర్యాటక కేంద్రంగా ఉన్న సూర్యలంక బీచ్ తీరాన్ని సినిమా షూటింగ్‌లకు స్పాట్‌గా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో సినీపరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించిన నేపథ్యంలో సూర్యలంకబీచ్‌లో సినీ షూటింగ్‌లు చిత్రీకరించుకోవటానికి తగిన మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. చిత్రీకరణకు వచ్చే నటులకు, సాంకేతిక నిపుణులకు వసతి సౌకర్యంతో పాటుగా షూటింగ్ చేయటానికి రెండు గృహాలను ఆర్ట్ డైరెక్టర్‌లకు ఏర్పాటు చేయాలని దిలీప్ రాజా కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సినీ దర్శకులు అర్జున కిషోర్, శ్రీనివాసయాదవ్, మణివరుణ్, నరేష్‌దోనె తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

● జిల్లా పౌరసరఫరాల అధికారి ఈబి విలియమ్స్

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కల్తీ పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఈబి విలియమ్స్ కోరారు. మండలంలోని వెదుళ్ళపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ డి.ఇమ్మానియేలు అధ్యక్షత వహించగా విలియమ్స్ మాట్లాడుతూ విద్యార్థులు రంగులు, రసాయనాలతో కూడిన కల్తీపదార్థాలను తిని అనారోగ్యానికి లోనుకాకుండా చూసుకోవాలన్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రణీత్ మాట్లాడుతూ కల్తీ పదార్థాలపై అవగాహన కలిగియుండాలన్నారు. తూనికలు, కొలతల శాఖాధికారులు రాందాస్, కె.నాగేశ్వరరావులు తూనికలు కొలతలు గురించిన స్టాల్ ద్వారా జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి బ్రహ్మం ఆరోగ్యంపై అవగాహన కల్పించగా ఏడీఏ ఎ.లక్ష్మీ ఎరువులు, విత్తనాలు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సాధిక్, హైస్కూల్ హెడ్మాష్టర్ సుబ్బారావు, వినియోగదారుల సంఘాల నాయకులు కరీముల్లా, ఆట్ల బాలాజీరెడ్డి, కట్టా శ్రీనివాసరావు, ఎస్‌డి.మతీన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక దాడులను నివారించాలి

● జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యూత్ కుమార్



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యూత్ కుమార్

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లలపై లైంగిక దాడులను నివారించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యూత్ కుమార్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఈ విషయమై ఆరోగ్యశాఖాధికారులు, విద్యాశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ తదితర ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడీ కార్యక్రమాధికారి డాక్టర్ కె.లలిత రాజేశ్వరి అధ్యక్షత వహించగా మనోజ్ పాల్గొని పిల్లలపై లైంగిక దాడులు జరిగిన తర్వాత సాక్ష్యాలు ఎలా సేకరించాలో వివరించారు. చైల్డ్ సైకాలజిస్ట్ ఆర్.సుప్రజ, జ్యోతిర్మయి, నాగకోటేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎదిగే వయస్సులో ఉన్న పిల్లలతో కొంత సమయం కేటాయించాలని, స్నేహపూర్తిమైన వాతావరణంలో వారితో అన్ని సమస్యలు చర్చించినప్పుడే పిల్లలు అన్ని విషయాలు పంచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ మహ్మద్ సాధిక్, నోడల్ అధికారి డాక్టర్ బి.వీరబ్రహ్మం, డాక్టర్ కె.భూషణం, పి.నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్త తయారే ఆశయం

● కేవీఐపీ డైరెక్టర్ ఎస్.గ్రీఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీఐపీ డైరెక్టర్ ఎస్.గ్రీఫ్

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతికుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయటమే ముఖ్యమంత్రి ఆశయమని కేవీఐపీ డైరెక్టర్ ఎస్.గ్రీఫ్ తెలిపారు. బాపట్ల స్త్రీశక్తి భవన్‌లో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం, ఖాది గ్రామీణ పరిశ్రమ సంస్థ వారి సౌజన్యంతో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్.గ్రీఫ్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు భారత ప్రభుత్వం ప్రారంభించిన క్రెడిట్- లింక్డ్ సబ్సిడీ పథకం పారిశ్రామికవేత్తలకు వరమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వి.కోటిరెడ్డి, ఏపీఎంలు ఎన్.శ్రీనివాసరెడ్డి, బి.సురేష్, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనానికి పరిసరాల పరిశుభ్రత అవశ్యం

● ఎమ్మెల్యే ఆనందబాబు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

చుండూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకరమైన జీవనానికి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం తప్పక పాటించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. దుండిపాలెంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా అందరిచే స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, ప్రపంచంలోనే విజన్ ఉన్న నాయకులు చంద్రబాబు గుర్తింపు పొందారని అన్నారు. యువత నూతన ఆవిష్కరణలను ఆకలింపు చేసుకుని ముందుకు వెళితేనే భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, గుదేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, వీఎస్‌కె ప్రసాద్, పిట్ట వెంకటరెడ్డి, నాగేంద్రరెడ్డి, జొన్నకూటి సాంబశివరావు, భీమవరపు శ్రీమాన్, తియ్యగూర రాఘవరెడ్డి, తహసీల్దార్ డి.నాగరాజు, ఎంపీడీవో సుదీప పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



రేపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

రేపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడరాదని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ వైద్యశాలలో మొక్కలను నాటారు. రింగురోడ్డు నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి మానవహారంగా ఏర్పడ్డారు. మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మొక్కలను నాటటం జరిగిందని తెలిపారు. చైర్‌పర్సన్ కట్టామంగ, వైస్ చైర్మన్ టీకేవీ గుప్తా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, టీడీపీ నాయకులు పంతాని సాయికుమార్, దేవగిరి రవి పాల్గొన్నారు.

కొండుభొట్లపాలెంలో ...

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామంలో స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లంసరోజినీ ర్యాలీ ప్రారంభించి గ్రామంలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు ఉమారెడ్డి వెంకటేష్, గ్రామపార్టీ అధ్యక్షులు ఎం.కొండలు, సచివాలయ సెక్రటరి ఝాన్సీరాణి, బూత్ ఇన్‌చార్జి మార్పు ప్రతాప్, లూదియా, జయ, ఆనంద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, యానిమేటర్లు పాల్గొన్నారు. మండలంలోని ఈతేరు గ్రామంలో మండలటీడీపీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో...

పిట్టలవానిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాపట్ల డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై.సత్యనారాయణరావు సంయుక్తంగా అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సచివాలయ ఉదోగులు, పారిశుధ్య కార్మికులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యార్థులు పలువురు నాయకులు, మండల స్థాయి అధికారులతో కలిసి ఖాజీపాలెం గ్రామంలోని పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కె.అనూష, గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటశివకుమార్, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషా బాబు, సూపరింటెండెంట్ బి.మదుసూధనరెడ్డి, కూసంపూడి దేవేంద్ర రాజు, దండు శ్రీనివాసరాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమోతువారిపాలెంలో ..

కర్లపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమాన్ని ప్రజలలోకి బలంగా తీసుకెళ్ళగలిగినప్పుడే స్వర్ణాంధ్ర సాకారమవుతుందని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాలను శుభ్రపర్చుకోవటంతోపాటు ముఖ్యంగా పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయం సిబ్బందితో, ప్రజలతో ఆయన స్వచ్ఛత దివస్ ప్రతిజ్ఞ చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరి పి.వెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు మాడా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని కూరగాయలు అమ్మేవారికి, ప్రజలకు ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలియజేశారు. కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని గ్రామ సర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదామని ఎంపీపీ డివి లలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీ కార్యక్రమం నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్లాస్టిక్ సంచులను ప్రజలు వినియోగించరాదని, వాటిని నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ, మండల గ్రామాల్లో కూడా స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి గ్రామ సభల్లో ప్లాస్టిక్ నిషేధానికి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఏపీఎం శ్రీమన్నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణ, హౌసింగ్ ఏఈ సౌమ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో దంత వైద్య పరీక్షలు

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో శనివారం సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టీజీకే మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తాళ్ళూరి దేవకి, డాక్టర్ పొట్లూరి రాజశేఖర్ సిబ్బందితో కలిసి విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంతాల సంరక్షణ, దంతాల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, సిబార్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ళ

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్నంవారిపాలెంలో ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ళ మహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆలయకమిటీవారు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. చిన్నారులతో కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉప్పరపాలెం గేటు వద్ద ఆర్‌యుబీ నిర్మించాలి

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలోని ఉప్పరపాలెం రైల్వేగేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జిని త్వరితగతిని నిర్మించాలని పౌరసమైక్య సభ్యులు శనివారం విజయవాడ రైల్వేడివిజనల్ మేనేజర్ నరేంద్రపాటిల్‌కు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. బాపట్ల రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన ఆయనను కలిసి ద్విచక్రవాహనదారులకు, కార్లకు, ఆటోలకు అనువుగా ఉండేవిధంగా ఆర్‌యూబీ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే 4, 5వ నెంబరు ప్లాట్‌ఫారంలకు లిఫ్ట్‌సౌకర్యం వెంటనే కల్పించాలని కోరారు. వందేభారత్, జీటీ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ళు బాపట్ల స్టేషన్‌లో ఆపించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పౌరసమైక్య అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జమ్మద్‌బాషా, ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, సమైక్య సభ్యులు తోట రామాంజనేయులు, కరణం రవీంద్ర, మానం అప్పారావు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయటం హర్షణీయం

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయటం హర్షణీయమని జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు కోసం ప్రజలలో నుంచి పుట్టుకొచ్చిన జనసేన పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలబడటం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో జరిగే జనసేన కార్యక్రమాలలో ఇదే సహకారం అందించాలని కోరారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీ : వ్యక్తికి గాయాలు

బాపట్లరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అప్పికట్లకి చెందిన ఎం.అప్పారావు తన ద్విచక్ర వాహనానికి అప్పికట్ల సమీపంలో ఉన్న బంకులో పెట్రోలు పోయించుకొని తిరిగి వస్తుండగా బాపట్ల నుండి పొన్నూరు వైపు వెళుతున్న లారీ ఢీకొనటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వైద్యం కోసం పొన్నూరు వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

18న కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

పిట్టలవానిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంతెన వెంకటరాజు సేవాసమితి సౌజన్యంతో 18వ తేదీ సాయంత్రం 3 గంటలకు డిగ్రీ కళాశాల 44వ వార్షికోత్సవం కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు అధ్యక్షతన జరుగుతుందని కళాశాల పాలకవర్గం తెలిపారు.

వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించుకోవాలి

రేపల్లె, మార్చి15(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించుకుంటే నాణ్యమైన వస్తువులు వాస్తవమైన ధరలకు లభిస్తాయని రేపల్లె పారాలీగల్ వాలంటీర్ రాచాబత్తుని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు అమ్మినా, నాణ్యమైన వస్తువులు లేకపోయినా తక్షణమే వినియోగదారుల సంఘానికి ఫిర్యాదు చేయాలన్నారు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ దీనికోసం వాట్సాప్‌చాట్‌ను ముందుకు తీసుకు వచ్చిందని, ఎవరైనా అభ్యంతరాలు ఉంటే 88000 01915కు సూచన లేక ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ వాలంటీర్లు సయ్యద్‌దాహీర్ అహ్మద్, సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆదర్శ వేదిక సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

నగరం, మార్చి15(ఆంధ్రజ్యోతి) : హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాగేషన్ గురించి యువత లోతైన అధ్యయనం చేయాలని డాక్టర్ హీరా సింగ్ అన్నారు. నగరంలోని శ్రీవెలగపూడి రామకృష్ణ కళాశాలలో శనివారం డిజైన్‌థింకింగ్ ఫర్ యునోవేషన్ జాతీయ సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవటం ద్వారా ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నారు. డాక్టర్ కె.సుధాకర్ హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాగేషన్ గురించి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి తగిన సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, అమిరేష్‌రెడ్డి, ఆర్.ప్రసన్నబాబు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలు ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కొల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని గుంటూరుగూడెం చర్చి వద్ద దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వ పథకాలు, చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. భట్టిప్రోలు ఏపీఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గృహ హింస వ్యతిరేక చట్టం గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బోయపాటి తేజబాబు, సర్పంచ్ కృష్ణమోహన్, డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ భగవాన్‌దాస్, శ్రీలత, పి.మనోజ్, జి.సుధాకర్, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పలు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పూర్తయిన ఇంటర్ పరీక్షలు

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు శనివారంతో ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 1618 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1574 మంది హాజరయ్యారు. 44 మంది గైర్హాజరయ్యారు. రెండవ సంవత్సరం పరీక్షలకు 825 మందికిగాను 785 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ గాయత్రి తెలిపారు.

శ్యాంబాబు మృతి యువతకు తీరని నష్టం

కొల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం కార్యకర్త శ్యాంబాబు మృతి యువతకు తీరని నష్టమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మండల గ్రామం తిప్పలకట్టలో మండే శ్యాంబాబు సంస్మరణ సభలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడుతూ వరదల సమయంలో లంక గ్రామాల్లో వలంటీర్‌గా తన సేవలు అందించి ఆదర్శవంతంగా నిలిచిన శ్యాంబాబు ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు.తొలుత అంబేద్కర్, శ్యాంబాబు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణమోహన్, వేములపల్లి వెంకట్రామయ్య, సుధాకర్, మనోజ్, బీఎల్‌కే ప్రసాద్, పంతగాని నాగమల్లేశ్వరరావు, బి.నాగరాజు, బి.సుబ్బారావు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కృతికా శుక్లా, కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

● రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లా స్పెషలాఫీసర్ కృతికా శుక్లా తెలిపారు. బాపట్లలోని బాపట్ల జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల తీరు, పరీక్షా కేంద్రంలో వనరులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పగడ్బందీగా చర్యలు తీసుకుందని చెప్పారు. బాపట్లలోని అన్ని పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయని కలెక్టర్ జె.వెంకటమురళి వివరించారు. 7,979 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాల్సి ఉండగా 7,710 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, కళాశాల ప్రధానాచార్యులు జి.కోటేశ్వరరావు, పరీక్షా కేంద్రం సీఎస్ టి.భవానీ తదితరులు ఉన్నారు.

శంకరన్ సేవలు మరువలేనివి

పేద ప్రజల సంక్షేమం కోసం ఎస్ఆర్ శంకరన్ చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లా స్పెషలాఫీసర్ కృతికా శుక్లా అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌కు మొదటిసారిగా వచ్చిన ఆమె కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న జిల్లా స్పెషలాఫీసర్ కృతికా శుక్లా, కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి జిల్లా స్పెషలాఫీసర్, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ చేతుల మీదగా బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్స్ విభాగంలో మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఎస్‌కే జాన్ వ్యాసరచనలో, శ్రీ చైతన్యస్కూల్‌కు చెందిన ఎస్.గాయిత్రిరెడ్డి వక్తృత్వంలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో ఎన్.జస్విత, ఎ.దేవహర్షిణి బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు పలు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందారు. వారంతా ఎమ్మెల్యే ఆనందబాబును కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించి సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి సిఫారసు చేశారు. అక్కడి నుంచి వచ్చిన చెక్కులను కోటిపల్లి గ్రామానికి చెందిన మకుటం రమణ రూ.1,76,046, బెల్లంకొండ కృష్ణకుమారి రూ.46,151, దోనేపూడికి చెందిన వెనిగళ్ళ నాగచైతన్య భార్గవ్ రూ.97,758, క్రాప గ్రామానికి చెందిన యలవర్తి సుమతి రూ.1,00,000, తులిమిలి దివ్య రూ.1,02,260లకు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయా చెక్కులను బాధిత లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గుత్తికొండ లక్ష్మీజ్ఞానానంద భగవాన్ పాల్గొన్నారు.

ఓటర్ల క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలి

● నియోజకవర్గ ఎన్నికల అధికారి సుశీల



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారిణి సుశీల

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో 2024 నవంబరు 28వ తేదీ నుంచి అందిన 900 మంది ఓటర్ల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి సుశీల కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలపై పోలింగ్ కేంద్రం పరిధిలో 1200 మంది ఓటర్లు సంఖ్య దాటితే మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 20వ తేదీన వేమూరులోని రోశయ్య మీటింగ్ హాలు భవనంలో నియోజకవర్గ స్థాయి బీఎల్‌వోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అమృతలూరు, కొల్లూరు తహసీల్దార్లు నెహ్రూబాబు, శ్రీనివాసరావు, చుండూరు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, భట్టిప్రోలు సీనియర్ అసిస్టెంట్లు ప్రసన్న, టీడీపీ ప్రతినిధులు కోగంటి రాజేష్, బండారు సూరిబాబు, కాంగ్రెస్ పార్టీకి చెందిన తాడికొండ వెంకటేశ్వరరావు, బీజేపీకి చెందిన తాళ్లూరి మోహనకృష్ణ హాజరయ్యారు.

విద్యార్థులకు సరైన బాట వేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

చుండూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలోనే బాలల సంపూర్ణ ఎదుగుదలకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సరైన బాటలు వేస్తుందని రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. యడ్లపల్లి జడ్పీ పాఠశాలలో నూతనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలలో, ఉన్నత విద్యలోను ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాం కోసం పూర్వ విద్యార్థి కల్లూరి నాగేశ్వరరావు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించినందుకు శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ భయ్యా సతీష్, రావి సాయిబాబా, జిల్లా స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ బి.రవీంద్ర, జిల్లా స్కౌట్ ట్రైనింగ్ కమిషనర్ నరేష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, కె.రమాదేవి పాల్గొన్నారు.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు







శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు



చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు



కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు



కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు

గడువులోగా రైతుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ ప్రధాన కార్యాలయంలో సమస్యలపై సమీక్ష

ప్రాధాన్య క్రమంలోనే గ్రామ కంఠాల సమస్య పరిష్కారం

● సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించడానికే సీఆర్డీఏ తొలి ప్రాధాన్యమిస్తుందని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు అన్నారు. శనివారం విజయవాడ లెనిన్ సెంటర్ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్‌తో కలసి ఆయన గ్రీవెన్స్ పోర్టులో రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించారు. గడువులోగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టులో 93 సమస్యలు నమోదు కాగా రైతులందరిని పిలిచి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డే తో పాటుగా ప్రతి శనివారం విజయవాడ సీఆర్డీఏ ఆఫీసులో తానే స్వయంగా సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని కమిషనర్ తెలిపారు. రైతుల నుంచి నేరుగా కాకుండా ఆన్‌లైన్ విధానంలో కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు అందినప్పటి నుంచి అది పరిష్కారమయ్యే దాక ఎప్పటికప్పుడు రైతుల ఫోన్లకు మేసేజ్ వెళ్తుందని చెప్పారు. పలువురు రైతులు గ్రామ కంఠం భూముల సమస్యల గురించి ప్రస్తావించగా వాటిని ప్రాధాన్య క్రమంలో వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు డీసీలు, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు సర్వేయర్లు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్

సికింద్రాబాద్‌కు బదులుగా చర్లపల్లికి రైళ్ల మళ్లింపు

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా తొమ్మిది రైళ్లను దారి మళ్లించి చర్లపల్లి స్టేషన్‌లో నిలిపేందుకు రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పనులను చేపట్టినట్టు వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫారం, తదితరాలు రాకపోకలకు అనువుగా లేని కారణంగా రైళ్ల రాకపోకలను చర్లపల్లి నుంచి ఆపరేట్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కామారెడ్డి, వయా మౌలాలి బైపాస్ రూట్ నుంచి డైవర్షన్ అవుతాయని చెప్పారు. రైలు నెం.20809, 20810 శంబల్ పూర్-నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25, 26 తేదీల్లో చర్లపల్లిలో ఆగుతాయన్నారు. ఇదే క్రమంలో 20811, 20812 విశాపట్నం-హెచ్ఎస్ నాందేడ్, విశాఖపట్నం ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26, 27 తేదీల్లో చర్లపల్లి నుంచి ఆపరేట్ అవుతాయి. 18503, 18504 విశాఖపట్నం-సాయినగర్ షిరిడీ-విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, 25తేదీల్లో, 12787, 12788 నరసాపూర్-నాగర్‌సోల్-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25, 26 తేదీల్లో చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 17231, 17232 నరసాపూర్ - నాగర్‌సోల్ - నరసాపూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28, 29 తేదీల్లో చర్లపల్లి నుంచి ఆపరేట్ అవుతాయి. సికింద్రాబాద్ - బేగంపేట మీదుగా నడిచే రైళ్లు కొన్ని చర్లపల్లి టూ సనత్‌నగర్, లింగంపల్లి వయా అమ్ముగూడ బైపాస్ రూట్‌లో వెళతాయి. 17208, 17207 సాయినగర్ షిరిడీ-మచిలీపట్నం ఏప్రిల్ 22, 23 తేదీల్లో, 17206, 17205 కాకినాడ పోర్టు-సాయినగర్ షిరిడీ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 23, 24 తేదీల్లో, 18519, 18520 విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినల్ ముంబయి-విశాఖపట్నం డైలీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, 22 తేదీల్లో మౌలాలీ, సికింద్రాబాద్ స్టేషన్లలో ఆగకుండా చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి, వయా అమ్ముగూడ బైపాస్ రూట్‌లో నడుస్తాయన్నారు.

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

(5వ పేజీ తరువాయి)

సంఘ సమావేశాలకు కోరం లేకపోవడంతో వాటిని వాయిదా వేశారు. మధ్యాహ్నం జరి గే సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీలు వస్తారులే అని అందరూ అనుకున్నారు. అయితే మధ్యాహ్నం 2.30 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగా అతితక్కువ మందే హాజరయ్యారు. దీంతో తొలుత గంటసేపు వాయిదా వేశారు. అప్పటికే సమావేశా నికి హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాపట్ల జేసీ ప్రభాకర్‌జైన్, పల్నాడు జేసీ సూరజ్‌ధనుంజయ్, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధుల కోసం ఎదురు చూశారు.

ఎమ్మెల్యేలు వస్తారని..

ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చే అవకాశం ఉందని చైర్‌పర్సన్ తొలుత ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలందరూ హాజరైనా కోరం సరిపోతుందని అందరూ ఊహించగా వారు కూడా సమావేశానికి గైర్హాజరయ్యారు. వాయిదా సమయం ముగిసిన తర్వాత కూడా జడ్పీటీసీలు సమావేశానికి హాజరుకాలేదు. జడ్పీలో మొత్తం 82 సభ్యులు ఉండగా(ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కలిపి) కేవలం 13 మంది మాత్రమే హాజరయ్యారు. కోరం కావాలంటే 27 మంది సభ్యులు ఉండాలి. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్ ప్రకటించారు.

బడ్జెట్ ఆమోదానికి అడ్డంకులు

శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2025-2026 అంచనా బడ్జెట్‌ను ఆమోదించాలి. రూ.643.80 కోట్లతో అధికారులు బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం కోసం పాలకవర్గం ముందుకు తీసుకువచ్చారు. బడ్జెట్ ఆమోదం పొందితేనే రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయింపు, చెల్లింపులు, ఖర్చులకు అవకాశం ఉంటుంది. అయితే జడ్పీటీసీలు సమావేశానికి రాకపోవడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి జడ్పీ చెల్లింపులు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు.



సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా

జడ్పీటీసీల దారిమళ్లింపు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో వైసీపీకే పూర్తి మెజార్టీ ఉంది. చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా కూడా ఆ పార్టీకి చెందిన వారే కాగా ఎన్నికల ముందు ఆమె భర్తతో కలిసి టీడీపీలో చేరారు. ఆ తర్వాత జరిగిన రెండు సమావేశాలకు జడ్పీటీసీలు హాజరయ్యారు. వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీటీసీలను ఇటీవల జగన్ వద్దకు తీసుకువెళ్లినట్లు సమాచారం. జడ్పీ విషయాల్లో సహాయ నిరాకరణ పాటించాలని జడ్పీటీసీలను జగన్ ఆదేశించినట్లు తెలుస్తుంది. అయినా జడ్పీ సమావేశానికి హాజరయ్యేందుకు జడ్పీటీసీలు సిద్ధం కాగా వారిని వైసీపీ నేతలు పిలిపించి అడ్డుకున్నట్లు సభ్యులు చెబుతున్నారు. వారితో నేతలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అక్కడే భోజనాలు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

గతంలో ఎన్నడూ లేదు...

గతంలో ఎన్నడూ లేని రాజకీయ పోకడ జడ్పీలో కనిపిస్తుంది. ప్రభుత్వాలు మారిన తర్వాత బలాబలాలు అటూఇటూ అయినా ఏ నాడు జడ్పీ సమావేశాలను బహిష్కరించిన దాఖలాలు లేవు. సమావేశాలకు జడ్పీ టీసీలు హాజరై సమస్యలపై నిలదీసేవారు. ప్రస్తుతం ఆ సంప్రదాయం మంటగలిసిందని ఇలా సమావేశాలు బాయ్‌కాట్ చేస్తే ప్రజా సమస్యల పరిష్కారం ఎలా అన్న ప్రశ్న ఎదురవుతోంది. దళిత మహిళ చైర్‌పర్సన్‌గా ఉండగా వైసీపీ ఇటువంటి రాజకీయ ఎత్తుగడలు వేయడం విమర్శలకు తావిస్తోంది. హెనీక్రిస్టీనా టీడీపీలోకి మారిన తర్వాత జరిగిన తొలి సమావేశంలో కూడా వైసీపీ ఇదే రీతిగా వ్యవహరించి విమర్శలు ఎదుర్కొన్నది. బడ్జెట్ ఆమోదంపై ఏర్పాటు చేసిన కీలక సమావేశంలోనూ అదే పంథాను ఎంచుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

మిర్చిలో అధిక మోతాదులో నెమ్ము శాతం

● ఆర బెట్టకుండా తీసుకొస్తున్న బళ్ళారి, హుబ్లీ, హోస్‌పేట రైతులు

● వాటి శాంపిల్స్ చూస్తూనే ఎగుమతిదారుల వెనకడుగు

● ధర పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న ఎండుమిరపకాయలలో నెమ్ము శాతం ఎక్కువ మోతాదులో ఉంటున్నది. పంట కోసిన తర్వాత కనీసం 20 రోజుల పాటు కళ్ళాల్లో ఎండబెట్టి తీసుకురావాల్సిన ఆ రాష్ట్ర రైతులు 10 రోజులకే తీసుకొస్తున్నారు. కొందరైతే కోసిన రోజునే కాయలు తీసుకొస్తున్నారని వ్యాపారస్థులు, అధికారులు చెబుతున్నారు. యార్డుకు నిత్యం 1.50 లక్షల నుంచి 1.80 లక్షల మిర్చి టిక్కీలు(40 కేజీలవి) వస్తుండగా వాటిల్లో 80 నుంచి 85 శాతం వరకు నెమ్ము అధిక మోతాదులో ఉంటుందని చెబుతున్నారు. ఇది ప్రత్యక్షంగా ధరలు పెరగకపోవడానికి కారణంగా మారుతున్నది. తేమ శాతం తక్కువగా ఉన్న మిరపకాయలు వస్తుంటే ఈ పాటికే క్వింటాల్ ధర రూ. 16 వేలకు చేరుకొని ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

రెండు వారాల క్రితం సీఎం చంద్రబాబు వద్ద మిర్చి వ్యాపారస్థులతో సమావేశం జరిగిన తర్వాత ధర క్వింటాల్‌కు రూ. 15 వేల వరకు చేరుకొన్నది. ఇక రైజింగ్ అవుతుందని అంతా భావించారు. ప్రభుత్వం కూడా మిర్చికి కనీస మద్దతు ధర ప్రకటించడంతో వ్యాపారస్థుల్లో పోటీ తలెత్తుతుందని, దాంతో రైతులకు మేలు జరుగుతుందని అంచనా వేశారు. అయితే కర్ణాటకలోని బళ్ళారి, హోస్‌పేట, హుబ్లీ నుంచి రైతులు తీసుకొస్తున్న మిర్చి టిక్కీలలో నెమ్ము శాతం అధికంగా ఉండటమే కాకుండా తాలు కూడా ఎక్కువ మోతాదులో ఉంటుంది. దాంతో ఎగుమతిదారులు పోటీపడి వాటిని కొనుగోలు చేయడం లేదు. దీంతో ధర తగ్గుతున్నది. ప్రస్తుతం వివిధ రకాల మిర్చి సగటు ధర రూ. 12 వేల నుంచి రూ. 13 వేల మధ్యనే ఉంటున్నది. కొన్ని టిక్కీలు అమ్ముడుపోకపోతుండటంతో రైతులు కమీషన్ వ్యాపారస్థుల దుకాణాల వద్దనే ఆరుబయట ఆరబోస్తున్నారు. దీని వలన యార్డులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నది.



నెమ్ము శాతం అధికంగా ఉండటంతో యార్డులోనే మిర్చిని ఎండబోసిన రైతులు

20 రోజులైనా ఎండబెట్టుకుని తీసుకురావాలి

ఏ చంద్రిక, మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి



ఈ విషయం మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకు కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులు నివేదించడంతో ఆమె మూడు రోజుల నుంచి అధికారులను ఆయా దుకాణాల వద్దకు పంపించి పరిశీలన చేయించారు. కర్ణాటక రైతులు తీసుకొస్తున్న మిర్చిలో ఎక్కువగా తేమ శాతం ఉందని అధికారులు నివేదిక ఇవ్వడంతో సెక్రెటరీ మైకులో రైతులకు విజ్ఞప్తి చేయించారు. మిర్చిని పొలం వద్దనే కనీసం 20 రోజులు ఎండబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. అప్పుడు అధిక ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలా తగినంత ఆరబెట్టకుండా తీసుకురావడం వలన అది మార్కెట్‌పై ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ విషయాన్ని రైతులంతా గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం





రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణాల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు




గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు



మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు



కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ



కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవం

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 15(ఆంధ్రజ్యోతి) పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత అమరేశ్వర స్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సం సందర్భంగా నిర్వహిస్తున్న పూజాకార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. గత నాలుగు రోజుల నుంచి ఆలయంలో వివిధ రకాల పూజాకార్యక్రమాలు అభిషేకాలు ఆలయ అర్చకులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రీ, నూతలపాటి సుబ్రహ్మణ్యం, మూలం రాజు కుమారస్వామి నేతృత్వంలో జరుగుతున్నాయి. శనివారం పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, మూగబలి, కలశోద్వాసనతో పూజాకార్యక్రమాలు ముగిసాయి. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు సారధ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్చూరులోని భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలు సజావుగా ముగిసాయి. శనివారం సీనియర్ ఇంటర్‌కు సంబంధించి పరీక్షలు జరిగాయి. పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు, నాగులపాలెం బాలయోగి గురుకుల కళాశాల, పర్చూరు బిఏఆర్అండ్ టీపీ కళాశాలకు సంబంధించి మొత్తం 1066 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, అందులో 77 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ జి.రవికుమార్, డిపార్టుమెంట్ ఆఫీసర్ బి.సునీత తెలిపారు.

మొక్కలను నాటాలి

అద్దంకి మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించడంతోపాటు, మొక్కలను నాటాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం శ్మశానంలో గో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో 10 గానుగ మొక్కలను కమిషనర్ రవీంద్ర నాటారు. సింగరకొండ రోడ్డులోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఈఈ నల్లూరి మస్తానరావు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది చేత ఈఈ మస్తానరావు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాలలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన ఆర్‌టీసీ తిరునాళ్ల ఆదాయం

అద్దంకి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ తిరునాళ్లకు అద్దంకి డిపో నుంచి 24 బస్సులను నడపడం ద్వారా 2లక్షల86వేల 920 రూపాయల ఆదాయం వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు శనివారం తెలిపారు. గత ఏడాది కన్నా రూ.80వేలు దనంగా ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

23న సాహిత్య పురస్కార సభ

అద్దంకిటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కార-2025 సభ ఈ నెల 23న పుట్టంరాజు కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం పురస్కార సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

భారీగా పెరిగిన తిరునాళ్ల ఆదాయం

శింగరకొండ ఆలయ హుండీల కానుకల లెక్కింపు

అద్దంకి, మార్చి15(ఆంధ్రజ్యోతి): శింగరకొండ 70 వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలలో హుండీల కానుకల ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాది కంటే భారీగా పెరిగింది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకల లెక్కింపును శనివారం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ఫెస్టివల్ ఆఫీసర్ రమణమ్మల పర్యవేక్షణ లో లెక్కించారు. గత ఏడాది హుండీల ద్వారా 8.26,081 రూపాయలు రాగా ఈ ఏడాది 14,25,272 రూపాయలు వచ్చాయి. గత ఏడాది కంటే సుమారు 6 లక్షల రూపాయలు అదనంగా వచ్చాయి. పూజా టికెట్ల ద్వారా గత ఏడాది రూ.8,26,435 రాగా, ఈ ఏడాది రూ.10,04,491 ఆదాయం వచ్చింది. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో 15 రోజులలో హుండీల ద్వారా వచ్చిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,38,334, పూజా టికెట్ల ద్వారా 1,28,270 రూపాయలు మొత్తం 2,66,604 రూపాయలు వచ్చింది. గత ఏడాది హుండీల ద్వారా 89,974 రూపాయలు, పూజా టికెట్లు ద్వారా 1,05,350 రూపాయలు వచ్చాయి. గత ఏడాది కంటే 71,280 రూపాయలు అదనంగా వచ్చింది. ఫెస్టివల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షించారు. గతంలో కంటే ఈ ఏడాది పగలు సమయంలో తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో దేవాలయాల ఆదాయం కూడా భారీగా పెరిగేందుకు దోహదపడింది.



డంపింగ్ యార్డ్‌లో వానపాములను వదులుతున్న అధికారులు

సంపద కేంద్రాలుగా డంపింగ్ యార్డులు

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు డంపింగ్ యార్డులను సంపద కేంద్రాలుగా వినియోగించుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ పీ సింగారావు అన్నారు. మండలంలోని ముప్పవరంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా డంపింగ్ యార్డును సందర్శించి వర్మీకంపోస్ట్ తయారీ కోసం తొట్లలో వానపాములు వదిలారు. పరిసరాలలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ప్లాస్టిక్ వినియోగం నిలిపి వేయాలని, దాని వలన కలిగే అనర్థాలపై దుకాణ దారులకు, నివాస ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తను ఇంటివద్దనే వేరు చేసి క్లాప్ మిత్రలకు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, టీడీపీ నాయకులు ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, జగన్, సర్పంచ్ సాంబశివరావు, కార్యదర్శి జానీబేగం, క్లాప్‌మిత్రలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మే ఆఖరులోగా గృహ నిర్మాణాలను పూర్తిచేసుకోవాలి

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది డిసెంబరు 10 తర్వాత పక్కా గృహాలు మంజూరై నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులు మే 31 లోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో గృహ నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా నిధులు చెల్లించేందుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియపరిచి మే 31లోగా అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఆర్, హౌసింగ్, ఏఈలు హనుమంతరావు. కిషోర్‌కుమార్, ఏపీఎంలు జ్యోతి ప్రసాద్, సంతోషం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, రావూరి రమేష్, ఓబుల్‌రెడ్డి, మురకొండ సుబ్బారావు, హౌసింగ్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణ రికవరీ నూరు శాతం పూర్తిచేయాలి

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాలు ఆర్థిక బలోపేతం అయ్యేందుకు సమకూర్చిన శ్రీ నిధి రుణ రికవరీ నూరు శాతం పూర్తి చేయాలని సెర్ప్ డీజీఎం నాగసుబ్రమణ్యం సూచించారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఏపీఎం అధ్యక్షతన జరిగిన వీవోఏల సమావేశంలో డీజీఎం మాట్లాడుతూ మండలంలోని 1236 స్వయం సహాయక సంఘలకు టార్గెట్‌ను మించి శ్రీ నిధి రుణాలు సమకూర్చడం మంచి పరిణామం అని, రుణ రికవరీ నూరు శాతం చేపడితే సెర్ప నుండి అదనపు నిధులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 20 నాటికి ఓడీలు, ఎన్‌పీఏ లేకుండా పూర్తి రికవరీలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏజీఎం నాగబాబు, మేనేజర్ టి.శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి భారతి, సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, వీవోఏలు పాల్గొన్నారు.



వెలుగు కార్యాలయంలో వీవోఏలకు సూచనలిస్తున్న సెర్ప్ డీజీఎం నాగసుబ్రమణ్యం



గుండ్లకమ్మనదిలో సూర్యాస్తమయ సమయంలో నీటిలో కన్పిస్తున్న ప్రతిబింబం, ఎరుపెక్కిన నీరు

ఎరుపెక్కిన గుండ్లకమ్మనది

సూర్యాస్తమయం సమయంలో గుండ్లకమ్మ నదిలో నీటిలో ఏర్పడిన ప్రతిబింబం ఎరుపెక్కిన నీరు ఆకాశం కనువిందు చేశాయి. శనివారం సాయంత్రం సూర్యాస్తమయంలో గుండ్లకమ్మ నదిపై చూడటానికి నది నీటిలో సూర్యుడు విలీనం అవువున్నట్లు దర్శనమిచ్చింది. ఆ సమయంలో ఆకాశంతో పాటు గుండ్లకమ్మ నీరు కూడా ఎరుపెక్కి కన్పించాయి. వాహన చోదకులు ఆదృశ్యాలను సెల్ ఫోన్‌లలో బంధించారు.

- అద్దంకి (ఆంధ్రజ్యోతి)

విద్యార్థినులకు జాతీయస్థాయి గుర్తింపు



ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహించే ఇన్‌స్పెయిర్ అవార్డులకు మండల పరిధిలోని అక్కయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక నైపుణ్యతను వెలికితీసే లక్ష్యంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ప్రాజెక్టులలో బాలికలు గవిని సుమామల్లేశ్వరి నీటి పంపిణీ విధానం, బెల్లంకొండ వైష్ణవి వైర్‌లెస్ పొల్యూషన్ మానిటరింగ్ సిస్టంను రూపొందించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రాలతో పాటు, ఒక్కొక్కరికీ రూ.10వేలు నగదు బహుమతి అందింది. దీంతో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవనం బద్రిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినిలను, వీరికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు కరోడి శ్రీనివాసరావు, అనూరాధ అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జయరావు, శ్రీనివాసరెడ్డి, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం, రమణ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు రైటింగ్ అట్టల పంపిణీ

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పాఠశాల హెచ్‌ఎం అనిత రైటింగ్ అట్టలు, పెన్, పెన్సిల్‌తో పాటు స్కేల్స్‌ను పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షలు దృష్టిలో ఉంచుకుని పాఠశాల భౌతిక శాస్త్ర బోధకుడు రాంగోపాలరెడ్డి 81 మంది విద్యార్థులకు ఆరు వేల విలువ చేసే వస్తువులను సమకూర్చారు. ఉపాధ్యాయుడు రాంగోపాలరెడ్డి విద్యార్థుల పట్ల చాటిన వితరణను హెచ్.యం. అనిత, పాఠశాల సహ ఉపాధ్యాయులు కొనియాడారు.



మార్టూరు చెరువు కట్ట నేలపై పగుళ్లు

మార్టూరు చెరువు కట్టపై పగుళ్లు

మార్టూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి చెరువు కట్టపై తూర్పు వైపున అక్కడక్కడా నేల పగుళ్లు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రెండుమూడు చోట్ల సుమారు 30 అడుగుల పొడవున పగుళ్లు కనిపిస్తున్నాయి. ఎండాకాలం కావడంతో ఈ పగుళ్లు మరింత పెద్దవయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మంచినీటి చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. ఇటీవల సాగర్ కాలువ నుంచి తాగునీటి కోసం చెరువుకు తగు పాళ్లలో నీళ్లను పెట్టారు. అయితే చెరువుకట్టకు తూర్పువైపున పగుళ్లు ఉండటంతో చెరువును పూర్తిగా నింపలేదు. అదిగాకుండా చెరువులో తూర్పువైపున చెరువులోతు ఎక్కువగా ఉండడం వలన అక్కడ భారీగా నీటి నిల్వలు ఉన్నాయి. వాటి అంచున చెరువు కట్టపై పగుళ్లు ఏర్పడడంతో, ఏదైనా భారీగా వర్షం కురిస్తే ప్రమాదం జరిగే అ వకాశం ఉంది. ఇదిలా ఉండగా చెరువులో నీళ్లు ఎ క్కువగా ఉండడంతో ప్రస్తుతం పగుళ్లను పూడ్చటానికి అవకాశంలేదు. అయితే రోజూ చెరువు కట్టపై వాకింగ్ కోసం వచ్చే వారు కట్టపై ఏర్పడిన పగుళ్ల తో నడక కోసం ఇబ్బందులు పడుతున్నారు.వాటి పగుళ్లలో కాళ్లు మడతపడే అవ కాశం ఉందని వాకింగ్ చేసే వృద్ధులు,మహిళలు భయపడుతున్నారు.ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. కొంత పగుళ్లు వచ్చిన మాట వాస్తవమే నన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను చెరువుకట్టపైకి తీసుకువచ్చి పగుళ్లను చూపించామన్నారు. చెరువులో కొంతమేర నీరు తగ్గినపుడు పగుళ్లె రిపేరుపనులు చేపడతామన్నారు.

కుంభాభిషేకానికి పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లపై పూజారులతో చర్చిస్తున్న ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు

అద్దంకి,మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతిముఖమండపం పునః నిర్మాణ, కుంభాభిషేకం పనులు నిర్వహణ పక్కా ప్రణాళికలతో చేయాలని ఈవో తిమ్మానాయుడు అన్నారు. మే 19వ తేదీన రాతి ముఖమండపం ప్రారంభం, కుంభాభిషేకం భారీ ఎత్తున నిర్వహించనున్న నేపథ్యంలో రెండునెలల కాలవ్యవధి మాత్రమే ఉన్నందువలన పనులు విభజించుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. కుంభాభిషేకం సమయంలో చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలపై చర్చించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆధ్వర్యంలో దాతలను కమిటీల సభ్యులుగా నియమించి, పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు హరిశంకరావధాని, ప్రధానపూజారి లక్ష్మీనారాయణ,ఇతర పూజారులు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో నరక ప్రయాణం

చీరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : దండుబాట - విజయనగర్ కాలనీ ప్రధాన రహదారిలో పలుచోట్ల గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో ప్రజలు చీరాల, పర్చూరు, కారంచేడు ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. మరమ్మతులతో రహదారి దారుణంగా మారింది. అంతేకాకుండా ఈ మార్గంలో విద్యుత్ దీపాల సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. దీంతో రాత్రయితే రాకపోకలకు తీవ్ర అసంతృప్తి కలుగుతుంది. అధికారులు రోడ్డుకు మరమ్మతులతోపాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల మయంగా దండుబాట రహదారి



దేవరపల్లి ఎత్తిపోతలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ఆరుతడులకు నీరు అందించడమే లక్ష్యం

- ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ
- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో పరిశీలన

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆరు తడులకు నీరు అందించి రైతులను ఆదుకునే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారని దేవరపల్లి ఎత్తిపోతల పథకం చైర్మన్ గోనుగుంట్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రైతులతో కలసి దేవరపల్లి గ్రామ పరిధిలోని ఓగేరు వాగుపై ఉన్న ఎత్తిపోతల పథకాన్ని ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. గత వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక అనేక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్చూరు నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చేలా ఎమ్మెల్యే ఏలూరి చొరవ చూపారన్నారు. అందులో భాగంగా రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎత్తిపోతల పథకాల పరిశీలనకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసి వానియోగంలోకి తేనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి సురేష్, గోనుగుంట్ల నాగేశ్వరరావు, పుల్లెల సుబ్బారావు, తోకల తిరుపతి స్వాములు, సుబ్బారావు, చిమల సత్యం, గద్దె వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ఇంకొల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రగాయాలతో మృతి చెందిన ఘటన పాతమద్రాసు రోడ్డులోని కొణికిపల్లె సమీపంలోని వీరయ్యవాగు వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగులుప్పలపాడు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆసుతోటి నరసంహారావు (62) ఇంకొల్లు మండలంలోని నాగండ్ల గ్రామంలోని తన కూతురు దగ్గరకు వెళ్లి తిరిగి అగ్రహారం వెళుతుండగా వాగు సమీపంలో ఎదురెదురుగా మోపెడ్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నరసింహారావు తలకు తీవ్రగాయాలు కాగా, 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందు తూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న దాత కమలేశ్వరరావు

ఇంకొల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం కృష్ణయ్య ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు కరి కమలేశ్వరరావు పరీక్ష సామగ్రిని అందజేశారు. శనివారం ప్రతి విద్యార్థికి ప్యాడ్, పెన్ను, పెన్సిల్, ఎరైజర్‌ను అందజేసి సోమవారం నుంచి జరగనున్న పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, ఉపాధ్యాయులు సుమలత, దుర్గ, విజయలక్ష్మి, రాధ, జానకి, జయశంకర్, రమ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న రైల్వే ఎస్సై కొండయ్య

చీరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కదిలే రైళ్లల్లో ప్రయాణికులకు మత్తు పదార్థాలు ఇచ్చి విలువైన బంగారు, వెడి, నగదు అపహరించే ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై కొండయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయచూర్‌కు చెందిన కాజల్‌వర్మ, హర్యానాకు చెందిన విజయేందర్ కుమార్ వేర్వేరుగా రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో నమోదయిన కేసుల్లో జనవరిలో కాజల్ వర్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అనంతరం గాలింపు చర్యలు నిర్వహించి రెండు రోజుల కిందట హర్యానా మోచివాలి ప్రాంతంలో విజయేందర్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్ నిమిత్తం నెల్లూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈక్రమంలో ఉన్నతాధికారులు పోలీసులను అభినందించారు.

వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగ చోరీ

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమూరు గ్రామంలో అలవలపాడు వైపు వెళ్లే పంట పొలాలలో వ్యవసాయ విద్యుత్ పంప్ సెట్లకు అమర్చిన విద్యుత్ తీగ ఏడు చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని గ్రామ రైతు కుర్రా వెంకటేశ్వర్లు తెలిపారు. గడిచిన నాలుగు నెలలలో ఇది రెండవసారి అన్నారు. విద్యుత్ వైర్లు గతంలో చోరీ జరిగిన సమయంలో రూ.5వేలు వెచ్చించి తిరిగి అమర్చుకున్నామన్నారు. మొక్కజొన్న పాలు పోసుకునే దశలో ఉందని. విద్యుత్ తీగ చోరీతో తడులు పెట్టలేని పరిస్థితి నెలకుందని రైతు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

బొబ్బేపల్లిలో వివాహిత ఆత్మహత్య

మార్టూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో షేక్ సబియా (28) అనే వివాహిత పుట్టింట్లో వంట గదిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్థరాత్రి జరిగింది. ఆమెకు భర్త సద్దాం హుస్సేన్, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం బొబ్బేపల్లి గ్రామానికి చెందిన సబియాకు పెద్ద దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్‌తో 10 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడ పిల్లలు. అయితే భర్తతో విభేదాలు కారణంగా ఏడాది నుంచి సబియా బొబ్బేపల్లి గ్రామంలో పిల్లలతో కలిసి పుట్టింట్లోనే ఉంటున్నారు.ఈ విషయమై తీవ్ర మానసిక వ్యధకు లోనైన సబియా ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి తల్లి నూర్జహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించి మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించారు. యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెన్న కేశవస్వామి దేవస్థానంలో శాంతి హోమం చేస్తున్న భక్తులు

ఘనంగా చెన్నకేశవస్వామి వార్షికోత్సవం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో శనివారం శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామివారి అనంత వార్షికోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో శాంతిహోమాన్ని నిర్వహించారు. దేవస్థానం అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత తోమాల మండల ఆరాధనలు మూ మూర్తి విశేష అర్చనలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారికి చేయించిన రజత కిరీటాలను మూలమూర్తులు ఉత్సవమూర్తులకు అలంకరించారు. తరువాత భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

మొక్కజొన్న పైరు పరిశీలన



మొక్కజొన్నను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బల్లికురవ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారి పాలెంలో బొబ్బాల వెంకట్రావు సాగు చేసిన మొక్క జొన్నను వ్యవసాయ పరిశోధన స్థానం లాం ఫాం శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించింది. రైతు వెంకట్రావు కర్నూల్ సీడ్స్ వారి టైసన్ రకం మొక్కజొన్న విత్తనాలను నాటగా 80 రోజులు దాటిన పైరు బాగా ఎదిగిన చిట్టి కండేలు పడడంతో దిగుబడి రాలేదని వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాస్త్రవేత్తల బృందం పైరును పరిశీలించింది. కండె ఎందుకు పెరగలేదు, విత్తనాలలో ఎవైనా లోపాలు ఉన్నాయా అనేదానిని పరిశీలించారు. కొన్ని కండెలను శాంపిల్‌గా తీసుకువెళ్లారు. విత్తనాలలో లోపాలు ఉంటే వెంటనే ల్యాబ్ ద్వారా పరీక్షలు చేయిస్తామని రైతుకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో శాస్త్రవేత్తలు డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ దయానాగ్రేస్, మార్టురు వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఏవో కుమారి, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : బయటమంజులూరు గ్రామంలో సాగులో ఉన్న మొక్కజొన్న పైరును వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామ రైతు కొమ్మాలపాటి ఆదిశేషయ్య బయటమంజులూరు గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని ముప్పవరం బాలాజీ విత్తన విక్రయ కేంద్రంలో కర్నూల్ విత్తన కంపెనీ వారి టైసన్ రకం, లాటినం విత్తనాన్ని కొనుగోలు చేసి, మొక్కజొన్న సాగు చేపట్టారు. పైరు 76 రోజుల నుంచి 80 రోజుల దశకు చేరుకున్నప్పటికీ వెన్ను రాకపోవడంతో విత్తన లోపం ఉందని ఫిర్యాదు చేశారు. శాస్త్రవేత్తల బృందం లోపాన్ని గుర్తించేందుకు కొన్ని మొక్కలను వెంటతీసుకు వెళ్లారు.

రాజకీయ చరిత్రలో సీఎం చంద్రబాబు అరుదైన రికార్డు

ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆశీస్సులతో అరుదైన గౌరవం దక్కించుకున్నారని, ఆయన రాజకీయ ప్రయాణం అందరికీ ఆదర్శనీయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. చంద్రబాబు సేవలను శనివారం ప్రకటనలో ఆయన కొనియాడారు. సీఎం చంద్రబాబు శాసన సభలో తొలి ప్రమాణ స్వీకారానికి నేటితో 47 ఏళ్లు పూర్తి చేసుకున్నారన్నారు. శాసన సభ్యునిగా 15 మార్చి 1978న మొదటి సారిగా ఎమ్మెల్యేగా చంద్రబాబు శాసన సభలో ప్రమాణ స్వీకారం చేశారన్నారు. ఎమ్మెల్యేగా 41ఏళ్లు, సీఎంగా 15ఏళ్లు పూర్తిచేసుకుని ఏపీ చరిత్రలో అరుదైన రికార్డును



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

సొంతం చేసుకున్నారని ఆయన కొనియాడారు. అభివృద్ధి సంక్షేమం, సామాజిక న్యాయం చేయడంలో బహుముఖ ప్రజ్ఞ చూపడం వల్లనే సుదీర్ఘకాలం చంద్రబాబును ప్రజలు ఆదరించారన్నారు.

సామాజిక న్యాయానికి మారుపేరు చంద్రన్న

మహిళా సాధికారత, విద్యా ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 33శాతం రిజర్వేషన్‌ల కల్పనలో సీఎం చంద్రబాబు చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదన్నారు. డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని ఏలూరి అన్నారు. రాష్ట్రంలో నేడు రూ.60వేల కోట్ల బ్యాంకు రుణాలు తీసుకునే స్థాయికి డ్వాక్రా మహిళలు ఎదిగారని, ఇది చంద్రబాబు చేసిన కృషికి నిదర్శనమని కొనియాడారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా లక్షల మందికి వైద్యం అందించి తనదైన రికార్డును సొంతం చేసుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పాలి

ముమ్మరంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



వాడరేవు తీరంలో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

చీరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల అధికారులు సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా ప్లాస్టిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. వాడరేవు సముద్రతీరంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈక్రమంలో ప్లాస్టిక్‌తో ప్రమాదాన్ని స్థానికులకు వివరించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఎపిఎం మధు తదితర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

వేటపాలెంలో..

మండల పరిధిలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ పార్వతి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు విద్యార్థులకు స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పించారు. పర్యావరణంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, సెక్రటరీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ రైతు బజార్, ఫిష్ మార్కెట్ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. వస్త్ర సంచులను పంపిణీ చేశారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు జరిగాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు స్వచ్ఛ గ్రామాలుగా ఉండేలా ప్రజలు సహకరించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ కోరారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైదనలో ప్రత్యేక పారిశుధ్య కార్యమాన్ని బాలమ్మ పరిశీలించారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

మార్టూరు : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పాలంటూ శనివారం మండలంలోని కోలలపూడి గ్రామంలో గ్రామస్థులు సచివాలయ ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలంటూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ యం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వారు ఆటో స్టాండ్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. మార్టూరు గ్రామ పంచాయతీలో ప్రత్యేకంగా శానిటేషన్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్రామంలో శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. యద్దనపూడి మండలంలో యద్దనపూడి ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డీటీ మస్తానరావు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

అద్దంకిటౌన్ : గ్రామ పంచాయతీల పరిధిలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, పరిశుభ్రతలో ప్రతి ఒ క్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని వెంపరాల గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్లాస్టిక్ వాడకం నిషేధమన్నారు. మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే మన ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా సీజనల్‌గా వచ్చే వ్యాధులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ అండ్ ఆర్‌డీ ఆర్‌విఎస్ ప్రసాదరావు, ఏపివో గాయత్రిదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

'పది' పరీక్షకు సర్వం సిద్ధం

డిప్యూటీ ఈవో గంగాధర్

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు డిప్యూటీ ఈవో గంగాధర్ అన్నారు. పది పరీక్షల నిర్వహణపై శనివారం వివరాలను వెల్లడించారు. చీరాల ఉపవిద్యాశాఖ పరిధిలో మొత్తం 9,813 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. 53 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కేంద్రాల్లో వసతులను కల్పించామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సౌకర్యంతోపాటు, మెడికల్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. డిప్యూటీ ఈవో గంగాధర్ తెలిపారు.

మార్టూరు : మండలంలో సోమవారం నుంచి 10వతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలోని 957 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 55 మంది ఇన్విజిలేటర్లను యమించారు. దాదాపుగా ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ తదితర వసతులను ఏర్పాటుచేసినట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాలైన రాయల్ హైస్కూల్లో 172, శ్రీచైతన్య స్కూల్లో 162, ద్రోణాదుల జడ్పీ హైస్కూల్లో 169, మార్టూరు జడ్పీలో 180, వలపర్ల జడ్పీ హైస్కూల్లో 272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. యద్దనపూడి మండలంలో రెండు పరీక్షా కేంద్రాలలో సోమవారం పరీక్షలు రాయనున్నారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్లో 127 మంది, పూనూరు జడ్పీ హైస్కూల్లో 149 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.